పిండివంటల తయారీలో మహిళలు బిజీ


పెగడపల్లిలో సకినాలు పోస్తున్న మహిళలు

పెగడపల్లి: గ్రామాల్లో సంక్రాంతి పండుగ వాతావరణం కొట్టొచ్చినట్లు కనపడుతోంది. బియ్యం నూర్పిడి కోసం గిర్నీల వద్ద సందడి నెలకొంది. ప్రతి ఇంట్లో పిండివంటల తయారీ ఊపందుకుంది. మహిళలు ఇదే పనిలో బిజీబిజీగా ఉన్నారు. వణికిస్తున్న చలిలో చిన్నాపెద్దా తేడా లేకుండా ఓ సకినాన్ని పంటి కింద వేసుకోవాలని తహతహలాడుతున్నారు. గ్రామాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.

నోరూరే పదార్థాలు

సకినాలు, గారెలు, అరిసలు, కరిజెలు, లడ్డూలు, పూసలు వంటి పిండి పదార్థాల తయారీలో ఇళ్లు ఘుమఘుమలు వెదజల్లుతున్నాయి. పిండి గిర్నీల వద్ద మహిళలు బారులు తీరుతున్నారు. ఆరుగాలం శ్రమించిన పంట ఉత్పత్తులతోనే పిండివంటలు చేసుకొని ఆరగించడం ఆనవాయితీ. చిన్నారుల కోసం ఆట వస్తువుల రూపంలో మలుస్తుంటారు. వీటిని తినేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతుంటారు. సకినాల తయారీకి ముందు మహిళలు పిండితో గౌరమ్మను చేసి పసుపుతో అలంకరిస్తారు. అనంతరం నేల మీద పరదాలు, చాపలు వేసి అందులో సకినాలు చుడుతారు. ముకుడులో ఉన్న వేడి నూనెలో వీటిని కాల్చుతారు. రకరకాల అప్పాలు తయారు చేసేందుకు ఇరుగుపొరుగువారి సహాయం తీసుకుంటున్నారు.

15న మకర సంక్రాంతి

ఈనెల 14న భోగి. 15న మకర సంక్రాంతి పండుగ. 16న కనుమ పండుగ. సంక్రాంతి ముందు భోగి పండుగ రోజు రైతులు బిజీగా ఉంటారు. తమ దుక్కిటెడ్లు, పాడి పశువులకు పూలు, పసుపు, రంగులు అద్ది అందంగా ముస్తాబు చేస్తారు. అనంతరం గ్రామ శివారులో పశువులన్నింటిని నిలిపి గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. ఇలా చేస్తే పశువులు అనారోగ్యం పాలవకుండా ఉంటాయని వారి నమ్మకం.

వ్యవసాయ విద్యార్థుల ఆందోళన


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న వ్యవసాయ విద్యార్థులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం జగిత్యాల–ధర్మపురి జాతీయ రహదారిపై ఆందోళన చేశారు. జయశంకర్ వ్యవసాయ వర్సిటీకి చెందిన 100 ఎకరాలను ప్రభుత్వం హైకోర్టుకు కేటాయించడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థి నాయకుడు బెల్లె సతీశ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో55ను ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యార్థి నాయకులు శివకుమార్, అనిల్, చంద్రశేఖర్, సాయి ఆశ్రిత్, సాయికృష్ణ, రమ్య, చరిత పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

మెట్‌పల్లి: రేగుంటకు చెందిన తిరుపతి గురువారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. తిరుపతి ఇటీవల స్థానిక రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాడు. ఆ తర్వాత మరో వ్యాపారికి విక్రయించాడు. అతడు డబ్బులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నాడు. మరోవైపు ధాన్యం విక్రయించిన రైతులు తమ డబ్బులు తమకు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. దీంతో మనస్తాపం చెందిన తిరుపతి గురువారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం: గోధూర్ వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఉమసాగర్ గురువారం తెలిపారు. మల్లాపూర్ మండలం సాతారం నుంచి గోధూర్‌కు అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసిన ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు.

కుక్కల దాడిలో దూడ మృతి

మల్లాపూర్: మండల కేంద్రంలో గురువారం వీధి కుక్కల దాడిలో దూడ మృతిచెందింది. గ్రామానికి చెందిన మొరపు గంగరాజంకు చెందిన దూడపై వీధి కుక్కలు దాడి చేయగా.. తీవ్రంగా గాయపడి మృతిచెందింది. సుమారు రూ.50వేల నష్టం జరిగిందని, ప్రభుత్వపరంగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

వాహనం దొంగిలించిన వ్యక్తి అరెస్టు

సారంగాపూర్: అర్పపల్లి గ్రామంలో ద్విచక్ర వాహనం దొంగిలించిన వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అర్పపల్లికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని గత సంవత్సరం బదినెపల్లి తిరుపతి ఎత్తుకెళ్లాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న తిరుపతిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

మెట్‌పల్లి: సమాజంలో పెరుగుతున్న నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ రవీందర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని చావిడి వద్ద గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. టెక్నాలజీని ఉపయోగించుకొని పలువురు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు గంజాయి వంటి చెడు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ చిరంజీవి పాల్గొన్నారు.

వృద్ధుడి దహన సంస్కారాలకు ఆర్థిక సాయం



మల్లాపూర్: వేంపల్లిలో గురువారం అనారోగ్యంతో వృద్ధుడు తోపారపు బీమయ్య(70) మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ బిట్ల సరోజన, ఎంపీటీసీ గుగ్లావత్ భూమి, ఇన్‌చార్జి ఉప సర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులు జహిందర్, మనస్విని, కారోబార్ రమేశ్, నాయకులు బిట్ల నరేష్, గుగ్లావత్ రాజేందర్, గంగాధర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామ పంచాయతీ నిధుల్లోంచి దహన సంస్కారాలకు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

చైర్మన్ పదవికి రాజీనామా చేయాలి

మెట్‌పల్లి: ఖాదీ ప్రతిష్టాన్ చైర్మన్ పదవికి మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు రాజీనామా చేయాలని ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్ మర్రి సహదేవ్, నాయకులు కేసుల సురేందర్, చెర్లపల్లి రాజేశ్వర్, పిప్పెర రాజేశ్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. అక్రమంగా నిర్మించిన ఖాదీ కాంప్లెక్స్ వల్ల మున్సిపల్ ఎంతో ఆదాయాన్ని కోల్పోయిందన్నారు. యామ రాజయ్య, షేక్ మహమ్మద్, తుమ్మనపల్లి రాంప్రసాద్, ముఖీమ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

జగిత్యాల: 2024–25 విద్యా సంవత్సరానికి తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్స్ ప్రవేశం కోసం 7–10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న ఉంటుందని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో షెడ్యూల్ ఉందని, దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సీజీజీ ద్వారా సమర్పించాలని అన్నారు. విద్యార్థుల ప్రవేశ రుసుము రూ.200, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, పీడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125 ఉంటుందన్నారు.

ఆదర్శ పాఠశాలలో..

మల్యాల: నూకపల్లి గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డి.సరితాదేవి తెలిపారు. ఆరోతరగతిలో 100 సీట్ల భర్తీతో పాటు 7వతరగతి నుంచి 10వతరగతి వరకు మిగిలిన సీట్లలో ప్రవేశం కోసం జనవరి 12 నుంచి ఫిబ్రవరి 22 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

షెడ్డు నిర్మాణానికి హామీ

వెల్గటూర్: స్థంభంపల్లిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు గురువారం దర్శించుకున్నారు. గుట్టపైన దేవాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మాణం కోసం సహకారం కోరగా.. వెంటనే స్పందించిన ఆయన షెడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఆలయ అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆగేనా.. సాగేనా..

- ఎంపీపీపై అవిశ్వాసం పెట్టిన సభ్యులు
- హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్న ఎంపీపీ
- ఆగ్రహంతో ఉన్న ఎంపీటీసీలు
- నేడు మల్యాల మండల సర్వసభ్య సమావేశం

మల్యాల: మండల పరిషత్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన ఎంపీటీసీలు శుక్రవారం నిర్వహించే సర్వసభ్య సమావేశానికి హాజరవుతారా.. సమావేశం సాఫీగా సాగుతుందా.. సమావేశం కోరం లేక వాయిదా పడుతుందా అన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఎంపీపీ మిట్టపల్లి సుదర్శన్‌పై గత డిసెంబర్ 23న అవిశ్వాసం నోటీసును పది మంది ఎంపీటీసీలు ఆర్డీవోకు అందజేశారు. జనవరి 10న ఆర్డీవో అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో అవిశ్వాస తీర్మానం వాయిదా వేయాలని ఎంపీపీ హైకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు తీసుకురావడంపై ఎంపీటీసీలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే సభ్యుల ప్రాథమిక హక్కులను కాలరాసేలా అవిశ్వాస తీర్మానం వాయిదా వేయాలని ఎంపీపీ కోర్టు ఉత్తర్వులు తీసుకురావడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పార్టీలకతీతంగా మండల పరిషత్ అభివృద్ధిలో అందరిని భాగస్వాములను చేయాల్సి ఉండగా.. కొంతమందిపై వివక్ష చూపుతున్నారంటూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన 10 మంది ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమావేశానికి హాజరవుతారా.. మండల ప్రజల సమస్యలు సభలో చర్చించి సమస్యల పరిష్కారం కోసం వ్యక్తిగత రాగద్వేషాలు పక్కనపెడుతారా అనే అంశం తేలాల్సి ఉంది.

ముందస్తు సంక్రాంతి వేడుకలు


నాచుపెల్లి వాసవి పాఠశాలలో..


ఇబ్రహీంపట్నం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో..


జగిత్యాల: మానస స్కూల్‌లో..

జగిత్యాల, కోరుట్లటౌన్, మెట్‌పల్లి, మల్లాపూర్, ధర్మపురి, వెల్గటూర్, కొండగట్టు(చొప్పదండి), కథలాపూర్, రాయికల్, ఇబ్రహీంపట్నం: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడంతో పాటు భోగి మంటలు కాల్చారు. పలువురు మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


రాయికల్: వివేకవర్ధిని పాఠశాలలో..



కథలాపూర్: మాస్ట్రో స్కూల్‌లో..


ధర్మపురి: ఏసీఈ ఆంగ్లోవేదిక్‌లో..


కోరుట్లటౌన్: సిద్ధార్థ విద్యార్థులు


మల్లాపూర్: సిరిపూర్ జెడ్పీ హైస్కూల్‌లో..


మెట్‌పల్లి: బ్రూక్లిన్‌లో..


వెల్గటూర్: అధ్యాపక బృందంతో చిన్నారులు

బహుమతులు అందజేత

కోరుట్ల: పట్టణంలోని నవజ్యోతి హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థుల తల్లులకు ముగ్గులు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ట్రస్మా అధ్యక్షుడు శంకర్, ట్రినిటి కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి బహుమతులు అందించారు.

బీఆర్‌ఎస్‌లోకి 18వ వార్డు కౌన్సిలర్

కోరుట్ల: పట్టణానికి చెందిన 18వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ పరహత్, ఆమె భర్త రహీం గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్ సమక్షంలో తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారం క్రితం కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్, ఆమె భర్త తిరిగి సొంత గూటికి చేరారు. బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అనిల్, రాజేశ్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, సజ్జు, నాయకులు ఫహీం, బద్ది మురళి తదితరులు పాల్గొన్నారు.

భోజన వసతి ఏర్పాటు అభినందనీయం


భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి: ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల కోసం సిబ్బంది సొంత ఖర్చులతో భోజన వసతిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. మెరుగైన ఫలితాల సాధనకు 325 విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భోజన వసతిని గురువారం ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి నారాయణతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు, ఉపన్యాసకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

జగిత్యాలరూరల్: స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని గురువారం కల్లెడ జిల్లాపరిషత్ పాఠశాలలో పెర్క యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సర్పంచ్ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీ పర్శరాంగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ సందీప్‌రావు, పెర్క సంఘం అధ్యక్షుడు రాంచంద్రం, యూత్ అధ్యక్షుడు సజన్, హెచ్‌ఎంలు విమల, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.


బైపాస్ రోడ్డు రద్దు చేయాలి

కోరుట్లరూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామానికి చెందిన 5, 6 వార్డుల రైతులు తమ భూముల గుండా నూతనంగా వేసే నేషనల్ హైవే రోడ్డును రద్దు చేయాలని కోరుతూ ఆర్డీవో రాజేశ్వర్‌కు గురువారం వినతి పత్రం సమర్పించారు.

ఉపాధ్యాయుల ఆర్థిక సాయం

మెట్‌పల్లి: పట్టణంలోని మండల విద్యావనరుల కేంద్రంలో అటెండర్‌గా పని చేస్తున్న బాజోజి నర్సయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడికి చికిత్స నిమిత్తం పలువురు ఉపాధ్యాయులు కలిసి గురువారం రూ.18,116 ఆర్థిక సాయం చేశారు. తులసీ ఆగమయ్య, మురళి, రామేశ్వర్, తాహెదర్, వేణుగోపాల్, బాలకిషన్, రాజేందర్, విజయభాస్కర్ తదితరులున్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



రాయికల్: ఇటిక్యాల గ్రామంలోని అంబేడ్కర్ యువజన సంఘం(మాల) అధ్యక్షుడిగా నీరటి శ్రీనివాస్, కార్యదర్శిగా బిట్ల కిరణ్, ఉపాధ్యక్షుడిగా నాగభూషణ్, సహాయ కార్యదర్శిగా వేల్పుల హరీశ్, కోశాధికారిగా గుండ గంగారాం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విశ్వబ్రాహ్మణ సేవ సంఘం కార్యవర్గం



రాయికల్: ఇటిక్యాల గ్రామంలో విశ్వబ్రాహ్మణ సేవ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొడిమ్యాల శంకర్, ఉపాధ్యక్షుడిగా కొడిమ్యాల లింగమూర్తి, కోశాధికారిగా రవీందర్, కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

సమస్యల పరిష్కారంలో ఎంపీపీ విఫలం



వెల్గటూర్: ఎంపీపీగా కూనమల్ల లక్ష్మి నాలుగున్నరేళ్లలో ఎంపీటీసీల సమస్యలు పరిష్కరించలేకపోయారని అంబరిపేట ఎంపీటీసీ జాడి సుజాత అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావుపై ఎంపీపీ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎంపీపీపై పెట్టిన అవిశ్వాసానికి అడ్లూరి, మాజీ ఎంపీపీకి ఎలాంటి సంబంధమూ లేదన్నారు. తను స్వతంత్ర ఎంపీటీసీని కాబట్టే అందరి మద్దతు అడిగానని, చివరి నిమిషంలో ఎంపీటీసీలను బీఆర్‌ఎస్ ప్రలోభపెట్టిందని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సర్పంచులు మురళి, శేఖర్, ఎంపీటీసీలు మంజుల, తిరుపతి, శ్రీజ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


నివాళి అర్పిస్తున్న అడ్లూరి లక్ష్మణ్, సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. గురువారం ఆయన జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గొప్పవారిని ఎప్పుడూ స్మరించుకోవాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ.. ఓబన్న గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఒడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాయిబాబా, ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమర యుద్ధ వీరుడు వడ్డె ఓబన్న

మల్లాపూర్: స్వాతంత్ర్య సమర యుద్ధ వీరుడు వడ్డె ఓబన్న అని వడ్డె ఓబన్న సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అల్లేపు నరేష్ అన్నారు. ఓబన్న జయంతిని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో ఓబన్న సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాసి వేసి నివాళి అర్పించారు. 1857 నాటి మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధానికి పదేళ్ల ముందే బ్రిటిష్ దుష్ట పాలనను తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి వడ్డె ఓబన్న ఎదురించి తిరుగుబాటు చేశారన్నారు. నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం

సాక్షి స్పందన


పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: యామపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బియ్యం రాక భోజనం లేక అనే శీర్షికన ఈనెల 4న సాక్షిలో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. గురువారం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలితో మధ్యాహ్న భోజనం వండించి విద్యార్థులకు భోజనాన్ని ప్రారంభించినట్లు ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు తెలిపారు. జూన్‌లో పాఠశాల ప్రారంభమయిన నుంచి మధ్యాహ్న భోజనం బంద్ కావడంతో విద్యార్థులు ఇంటి నుంచే తెచ్చుకొని తింటున్నారు. మధ్యాహ్న భోజనం ప్రారంభం కావడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

రూ.2లక్షల ప్రొసీడింగ్ కాపీ అందజేత

కథలాపూర్: ఊట్‌పెల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి దేవాలయం అభివృద్ధికి జెడ్పీ నిధులు రూ.2లక్షలు మంజూరు కాగా.. ప్రొసీడింగ్ కాపీని గురువారం మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి అందించారు. ఆలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరడంతో నిధులు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచ్ గజ్జెల స్వామి, నాయకులు ఏజీబీ మహేందర్, గుండారపు గంగాధర్, నాగేశ్వర్‌రావు, ఏజీబీ గణేశ్, రాచర్ల రవి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ స్కూల్ కోసం స్థల పరిశీలన

వెల్గటూర్: ప్రతీ మండలానికి ఒక సెంట్రల్ స్కూల్ నిర్మించడం కోసం ప్రతీ మండలంలో 10 ఎకరాల స్థలం ఎంపిక చేయాలనే ప్రభుత్వ ప్రతిపాదన మేరకు గురువారం జగిత్యాల ఆర్డీవో నరసింహమూర్తి వెల్గటూర్ తహసీల్దార్ శేఖర్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు. స్థంభంపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 1090లో గతంలో ఇథనాల్ పరిశ్రమకు కేటాయించిన స్థలం పక్కనే 10 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.

30వ వార్డులో గుడ్ మార్నింగ్ కోరుట్ల

కోరుట్ల: పట్టణంలోని 30వ వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం ఉదయం 7 గంటలకు గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డులోని పలు సమస్యలను ప్రజలనడిగి తెలుసుకున్నారు. కూరగాయల మార్కెట్‌ను సందర్శించి వ్యాపారులతో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కౌన్సిలర్ సజ్జు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డిప్యూటీ ఈఈ

జగిత్యాల: రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వెంకటరమణ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ మధు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

కేంద్ర పథకాలపై అవగాహన

గొల్లపల్లి: ఆత్మకూర్ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పీఆర్టీయూ రూపొందించిన డైరీని ఆవిష్కరించారు.

ఆధ్యాత్మికం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


తుంగూర్‌లో చిన్నారుల వేషధారణ

సారంగాపూర్: అయోధ్య రాముడి అక్షింతల అందజేత కార్యక్రమంలో గురువారం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బీర్‌పూర్ మండలం తుంగూర్‌లోని ఓ ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు.. గ్రామస్తులతో కలిసి రాముడి చరిత్రను వివరిస్తూ గ్రామంలో ఇంటింటా అక్షింతలను అందజేశారు. కోమన్‌పల్లి శివారు గ్రామం సిరిపురంలో పంపిణీ చేశారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు


మల్యాలలో ఇరుముడులతో స్వాములు

మల్యాల: మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప స్వాములు గురువారం శబరిమలకు వెళ్లారు. స్థానిక హరిహరపుత్ర అయ్యప్ప క్షేత్రంలో పూజలు చేసి, ఇరుముడి కట్టుకొని స్వామి నామస్మరణ చేస్తూ బయలుదేరారు. బండారి అశోక్, నాగరాజు, ముదాం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తుంగూర్‌లో యూనియన్ బ్యాంక్ ఏర్పాటుకు పరిశీలన

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో యూనియన్ బ్యాంక్ శాఖ ఏర్పాటుకు గురువారం అధికారులు పరిశీలించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటరెడ్డి, ఆర్‌ఎం శేఖర్ , ధర్మపురి మేనేజర్ రవితేజ తదితరులు గ్రామంలోని మూడు భవనాలను పరిశీలించి ఏ భవనం బ్యాంక్ ఏర్పాటు చేయడానికి అనుకూలంగా ఉంటుందన్న దానిపై వివరాలు సేకరించారు. వారి వెంట సర్పంచ్ గుడిసె శ్రీమతి, ఎంపీటీసీ అడెపు మల్లీశ్వరి తదితరులున్నారు. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ.. బ్యాంక్ ఏర్పాటు చేయాలని గతంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశామన్నారు.